క్లుప్తంగా

తేజ నర్సింగ్ హోం ప్రారంభం



నరసరావుపేట: స్థానిక పల్నాడురోడ్డులో నూతనంగా నిర్మించిన తేజ నర్సింగ్‌హోమ్‌ను శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఆత్మీయ అతిథులుగా సీనియర్ వైద్యులు డాక్టర్ మర్రి పెద్దయ్య, ఎం.అన్నపూర్ణమ్మ, ఓగూరి కోటయ్య, ముద్దన రమేష్‌బాబు, వివిధ విభాగాలను ప్రారంభించారు. ఆసుపత్రి నిర్వాహకులు బొట్లరంగ తేజ, డాక్టర్ కర్నాటి శ్రావణి మాట్లాడుతూ జనరల్ మెడిసిన్, లాపరోస్కోపిక్, గైనకాలజీ వైద్యసేవలు హాస్పిటల్‌లో లభిస్తాయన్నారు. నర్సింగ్‌హోం స్థాపకులు డాక్టర్ బొట్ల రఘుప్రసాదు, డాక్టర్ పార్వతీ పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, పార్టీ నాయకులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

నేడు వేల్పూరులో ఆలయ నిర్మాణానికి శ్రీకారం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న గంగమ్మ తల్లి దేవాలయం పునః నిర్మాణ కార్యక్రమం బుధవారం ఉదయం 8.31 నిమిషాలకు జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. సుమారు రూ. 50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హాజరవుతున్నారన్నారు.

27న కోటలో ఉరుసు



యడ్లపాడు: మండలంలోని కొండవీడు గ్రామం కొండవీడు కొండపైన మెట్ల మార్గంలో వేంచేసి హజరత్ సయ్యద్ పీర్ పాఛవలి బాబా ఉరుసు మహోత్సవం ఈనెల 27వ తేదీ శుక్రవారం నిర్వహిస్తున్నట్లు దర్గా నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి ప్రారంభమయ్యే ఈ ఉరుసుకు రాష్ట్రం నలుమూలల నుంచి తరలి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్నీ సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఉరుసు మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు రాత్రి 8 గంటలకు కోట గ్రామంలో భారీ అన్నదానం ఏర్పాటు చేసినట్లు వివరించారు. అదేరోజు రాత్రి గంధమహోత్సవ కార్యక్రమం బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున దర్గావద్దకు చేరుకుంటుందన్నారు. అనంతరం ముజావర్ల సమక్షంలో దీపారాధన (ఫాతెహా) నిర్వహించనున్నట్లు తెలిపారు. దర్గా కమిటీ సభ్యులు మద్దినగర్ షేక్ బాజీ, షేక్ ఖాజ (బాజీషహీద్ బ్యాటరీవర్క్), అలాం అమానుల్లా, అబ్దుల్ దావత్, అబ్బుతాలిక్, బాష ఉరుసు కార్యక్రమ వివరాలను తెలిపారు.

భవానీల దీక్ష విరమణ

నాదెండ్ల: గణపవరం ఆదిపరాశక్తి ఆలయంలో సోమవారం రాత్రి అమ్మవారికి భవాని పడి పూజ నిర్వహించారు. ఆదిపరాశక్తి క్షేత్రం పీఠాధిపతి నిత్య విద్యానంద భారతి స్వామి ఆధ్వర్యంలో భవానీ దీక్ష తీసుకున్న 15 మంది అమ్మవారికి లక్ష పత్రి పూజ, పడిపూజ నిర్వహించారు. అనంతరం భవానీలు దీక్షలను విరమించారు. గత ఐదేళ్లుగా విజయదశమి ముగింపు రోజున ఆనవాయితీగా అమ్మవారికి మొక్కుల రూపంలో గాజుల సమర్పణ చేశారు. ప్రతి ఏడాది విజయదశమికి 45 రోజుల ముందు ఇక్కడ మహిళా భక్తులు భవానీ దీక్ష తీసుకుంటారు.

జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు జగదీష్



నరసరావుపేట ఈస్ట్: సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో సాధన చేస్తున్న ఎస్.జగదీష్ జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు పల్నాడుజిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, మంగళవారం తెలిపారు. ఈనెల 26వ తేదీ నుంచి నవంబర్ 5వతేదీ వరకు గోవాలో జరగనున్న 37వ జాతీయస్థాయి అక్వాటిక్ స్విమ్మింగ్ పోటీలలో జగదీష్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిథ్యం వహిస్తాడని వివరించారు. ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈపోటీలను ఇండియాన్ ఒలంపిక్స్‌గా క్రీడాకారులు భావిస్తారని, అటువంటి పోటీలలో పల్నాడుజిల్లా నుంచి జగదీష్ ఎంపిక కావటం అభినందనీయమని తెలిపారు. జగదీష్‌ను జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఏ.వి.వి.రామ లింగారెడ్డి నూతన స్విమ్మింగ్ స్పోర్ట్స్ కిట్‌తో పాటు రూ.5 వేలు నగదుతో సత్కరించారు. జాతీయస్థాయిలో పల్నాడు జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

శభాష్ అంకారావు



స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట కల్వర్టుపై పడిన గుంతను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. ప్రతిరోజు ఎంతోమంది ఈ కార్యాలయానికి రాకపోకలు సాగిస్తుంటారు. విషయాన్ని గమనించిన ఆయన గుంతకు సిమెంటు పని చేయించి మండల వాసుల ప్రశంసలు పొందారు.

–శావల్యాపురం

చిత్రకారుడు వజ్రగిరికి అవార్డు



చోడవరం చిత్రకళాపరిషత్, విశాఖపట్నం జిల్లా ఆధ్వర్యంలో అక్టోబరులో నిర్వహించిన జాతీయస్థాయి చిత్రకళాపోటీల్లో వినుకొండ చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్ గీసిన ది సెన్సర్ చిత్రానికి యూనివర్సల్ మెగా అవార్డు లభించింది. నవంబరు నెలలో చోడవరంలో అవార్డును ప్రధానం చేస్తామని నిర్వాహకులు బి.సూర్యనారాయణ తెలియజేసినట్లు వివరించారు.

–వినుకొండ(నూజెండ్ల)

ఆడపడుచులకు అభినందనలు



దసరా ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీవాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీవాసవి, బతుకమ్మ అమ్మవార్ల అలంకరణ పోటీలను నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయ ఆవరణలో నిర్వహించిన పోటీలకు 108 మంది మహిళలు హాజరయ్యారు. విజేతలకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బహుమతులు అందచేశారు. పల్నాడుజిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, ఆర్యవైశ్య ప్రతినిధులు పూరా భాస్కరరావు, పెనుగొండ వెంకటేశ్వరరావు, కొత్తమాసు వెంకట మల్లారావు, నిడమానూరు సురేంద్ర, వెల్లంపల్లి కేశవరావు పాల్గొన్నారు.

–నరసరావుపేట ఈస్ట్

నాటుసారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

వినుకొండ(నూజెండ్ల): నాటుసారా అమ్ముతున్న మహిళను వినుకొండ ఎస్ఈబీ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వినుకొండ మండలంలోని పార్వతీపురం గ్రామంలో పోలేరమ్మ గుడి వద్ద త్రిపురాంతకం మండలం డీవీఎస్ కాలనీకి చెందిన పోలిశెట్టి నాగమణి అనే మహిళ నాటుసారా విక్రయిస్తుండగా ఆమెను అదుపులోకి తీసుకొని 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నాగమణిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి వినుకొండ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించడం జరిగింది. ఈ దాడిలో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్. విజయభాస్కరరావు, సబ్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు



వినుకొండ విఠంరాజుపల్లిలో మహిషాసురమర్దినిగా...



శావల్యాపురంలో రాజరాజేశ్వరీ అలంకరణ



రాజరాజేశ్వరి దేవి అలంకరణలో రొంపిచర్ల వాసవీ అమ్మవారు



రాజరాజేశ్వరి దేవి అలంకరణలో విప్పర్ల శివాలయంలోని కామాక్షి అమ్మవారు



సొలసలో రాజరాజేశ్వరీగా దుర్గాదేవి

వినుకొండ(నూజెండ్ల) : పట్టణంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజున అమ్మవారు మహిషాసుర మర్దిని అవతారం భక్తులకు దర్శనమిచ్చింది. పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వర అమ్మవారి ఆలయం, కామాక్షి కమలేశ్వర ఆలయాలతో పాటు శాంతి ఆశ్రమం ట్రస్ట్ హిమాలయ గురూజీ ఆధ్వర్యంలో వినుకొండ రూరల్ మండలంలోని విఠంరాజుపల్లిలోని సాయి బృందావనం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు 9వ రోజు మహిషాసురమర్దిని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా చండీయాగం, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులకు వేలాది పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ట్రస్ట్ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేసి అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. అలాగే వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రుద్రాభిషేకాలు, కుంకుమపూజలు, మహా చండీ హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అంకాలమ్మ తల్లి దేవస్థానంలో దసరా ఉత్సవాల్లో భాగంగా లలితా సహస్ర పారాయణం, కుంకుమార్చన పూజలు, భక్తిగీతాల ఆలపన, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రవ్వవరం వెంకటేశ్వర జగన్మాతపీఠంలో...

నూజెండ్ల మండలంలోని రవ్వవరం వెంకటేశ్వర జగన్మాతపీఠంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9వ రోజున అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కుంకుమార్చనలు, లలితాసహస్రనామ పారాయణం, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన సేవకులు దుర్గేశ్వరరావు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు, పోట్లూరు, శావల్యాపురం, మతుకుమల్లి, బొందిలిపాలెం తదితర గ్రామాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా మంగళవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. శావల్యాపురంలో వేంచేసియున్న కనకదుర్గమ్మ దేవాలయంలో గత 20 సంవత్సరాల నుంచి వైభవంగా వేడుకలు నిర్వహిస్తున్నారు. దసరా నవరాత్రుల్లో భాగంగా చివరిరోజు అమ్మవారు రాజరాజేశ్వరీ అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చింది. ఆలయ పూజారి రావిపాటి సాయి భరత్ ఆధ్వర్యంలో దేవాలయ ప్రాంగణంలో కొణతం ఎరుకలరెడ్డి-జయమ్మ దంపతులచే శమీపూజ వైభవంగా నిర్వహించారు. చివరిరోజు వేడుకలు సందర్భంగా అనంతరం 250 మంది మహిళలకు లాటరీ ద్వారా ప్రోత్సాహక బహుమతులు ఆలయ ట్రస్టు చైర్మన్ రెడ్డి జ్వాలా నరసింహారావు కమిటీ సభ్యులు చేతుల మీదగా అందజేశారు. మండలంలోని గంటావారిపాలెంలో శివాలయంలో దసరా వేడుకలు ఆలయ కమిటీ చైర్మన్ ప్రముఖ వ్యాపారవేత్త సత్యసీడ్స్ అధినేత కొసన రామకోటేశ్వరరావు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు సౌజన్యంతో వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. మండలంలోని కారుమంచి గ్రామంలో వేంచేసియున్న సాయిబాబా దేవాలయంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండల ప్రజలు దసరా పండుగ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు. ఆలయాల్లో దసర శరన్నవరాత్రులు నిర్వహించారు. ప్రతి రోజు ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు దర్శనమిచ్చారు. కొన్ని గ్రామాల్లో బతుకమ్మలను ఏర్పాటు చేసి తొమ్మిది రోజులపాటు పూజలు నిర్వహించారు. మహిళలు బతుకమ్మ పాటలను ఆలపిస్తూ భక్తిని చాటుకున్నారు. బతుకమ్మలకు గ్రామోత్సవాలను నిర్వహించి, నిమజ్జనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో తిరునాళ వాతావరణం సంతరించుకుంది. అలాగే దేవాలయాల ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవాలు నిర్వహించారు. రెండు రోజుల పాటు పండుగ గడియలు రావటంతో రెండు రోజులు పండుగను నిర్వహించారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట ఈస్ట్: శ్రీ దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు అమ్మవారు వివిధ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహించారు. ఉత్సవాలు ముగింపు రోజు అమ్మవారు రాజరాజేశ్వరీ అమ్మవారి అలంకరణలో దర్శనమిచ్చారు. శృంగేరి శంకరమఠంలోని శారదాంబ అమ్మవారు గజలక్ష్మీ అలంకరణలో దర్శనమిచ్చారు.

విజయదశమి వేళ అమ్మవారికి గ్రామోత్సవాలు

నాదెండ్ల: దేవీ శరన్నవరాత్రులు మంగళవారంతో ముగిశాయి. ఈ నెల 15న ప్రారంభమైన నవరాత్రులు సోమవారంతో ముగియగా, మంగళవారం అన్ని ప్రాంతాల్లో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. గణపవరంలో నూతనంగా నిర్మించిన కోదండరామాలయంలో మంగళవారం గ్రామోత్సవంలో భాగంగా చిలకలూరిపేటకు చెందిన మహిళలచే కోలాట ప్రదర్శన భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. 30 మంది మహిళలతో మాస్టర్ విజయ బృందం అద్భుతంగా కోలాట ప్రదర్శన నిర్వహించారు. రామ్‌నగర్‌లో కొలువైయున్న కోదండరామాలయంలో ఆదివారం రాత్రి అమ్మవారికి గణపతి హోమం, రుద్రహోమం, నవగ్రహ హోమం, లలితాహోమం, సుహాసిని పూజ, పాలపూజ నిర్వహించారు. రాజరాజేశ్వరి అలంకారంలో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. శాంతినగర్‌లోని చలువపందిరింలో గ్రామోత్సవం జరిపిబాపట్ల సముద్రంలో నిమజ్జనం చేశారు. సాతులూరు రామలింగేశ్వర ఆలయంలో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. నాదెండ్ల కన్యకాపరమేశ్వరి ఆలయం, శివాలయంతో పాటూ అన్ని గ్రామాల్లో నవరాత్రులు వైభవంగా జరిగాయి.

యడ్లపాడులో..

యడ్లపాడు: విజయదశమి సంబరాలు అంబరాన్నంటాయి. ఆలయాల్లో శరన్నవ రాత్రి వేడుకలు అత్యంత వైభవంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు వివిధ ఆకారాల్లో అభయమిచ్చిన అమ్మవారు చివరిగా రాజరాజేశ్వరీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగన్మాతను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ముగింపు ఉత్సవాల్లో భాగంగా గ్రామాల్లో ఊరేగింపులు, అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో బారులుదీరిన భక్తులు జగజ్జననీకి ప్రత్యేక పూజలు చేశారు. కొత్త వాహనాలను కొన్న యజమానులు అమ్మవారి ఆలయం చుట్టూ తమ వాహనాలను తిప్పి పూజలు చేయించారు. సాయంత్రం బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు అమ్మవారి ఆలయాలు, ఇతర ప్రాంతాల్లో ఉన్న శమీ వృక్షం చేరుకుని పూజలు నిర్వహించారు. జమ్మిచెట్టు చుట్టూ తొమ్మిది ప్రదక్షిణలు చేసి శమీపత్రిని తల్లిదండ్రులు, పెద్దలకు అందజేసి వారి దీవెనలు అందుకున్నారు. బోయపాలెం పార్వతీదేవి, హరిహరక్షేత్రం ఆలయాలు, యడ్లపాడు రాజరాజేశ్వరస్వామి ఆలయం, లింగారావుపాలెం గంగాపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం, సొలస బ్రహ్మంగారి ఆలయంలో దుర్గాదేవి అమ్మవారిని ఝాన్సీ ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ నిర్వహించి, పూజలు జరిగాయి. తిమ్మాపురం చౌడేశ్వర్వస్వామి ఆలయం, జాలాది హరిహర దత్తక్షేత్రం ఆలయం, జగ్గాపురం శివాలయం ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. ఆయా ఆలయాల్లో మహిళలు సామూహిక కుంకుమపూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

యడ్లపాడులో శమీపూజ

యడ్లపాడు: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని సొలస గ్రామంలోని భూసమేత రంగనాయక స్వామి దేవాలయంలో శమీపూజోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు పర్చూరి రామకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో మూలవిరాట్‌లతో పాటు ఉత్సవ మూర్తులకు వివిధ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ గావించారు. ఆలయ ఈవో సీహెచ్ శివయ్య పర్యవేక్షణలో నిర్వహించిన ఆయా కార్యక్రమాల్లో ఆలయ వంశంపారంపర్య ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్, నాగజ్యోతి దంపతులు, బాపతు చెన్నారెడ్డి, కృష్ణవేణి దంపతులు పాల్గొని పూజ హోమాలు అనంతరం ఉత్సవ మూర్తులను గ్రామోత్సవం నిర్వహించారు.



వినుకొండ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

వాసవీ మాతకు ఎమ్మెల్యే బొల్లా ప్రత్యేక పూజలు



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా, మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్‌లో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో విజయదశమి సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరి జీవితాల్లో అన్ని విజయాలు చేకూర్చాలని, అందరూ పాడిపంటలతో ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆ తల్లిని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఇరువురిని ఘనంగా సన్మానించారు. వారితో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్ల పోలీసు స్టేషన్లో ఆయుధ పూజ



నాదెండ్లలో ఆయుధ పూజలో పాల్గొన్న పోలీసులు

నాదెండ్ల: విజయదశమిని పురస్కరించుకుని నాదెండ్ల పోలీస్ స్టేషన్‌లో మంగళవారం పోలీసులు ఆయుధపూజ నిర్వహించారు. ఎస్సై జె.బలరామ్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది తమ ఆయుధాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయుధ పూజలో ఎస్సై బలరామిరెడ్డితో పాటూ సిబ్బంది సాంప్రదాయ వస్త్రాలతో కూర్చుని పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వేదపండితులు ఆయుధాలకు కుంకుమ హారతి ఇచ్చారు. పలు పరిశ్రమల్లో సైతం యజమానులు ఆయుధపూజ, యంత్రపూజలు నిర్వహించారు.



నరసరావుపేట రెడ్డినగర్‌లో ఏర్పాటు చేసిన బతుకమ్మలకు పూజలు చేస్తున్న భక్తులు



బోయపాలెంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



శమీపూజ నిర్వహిస్తున్న ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్, నాగజ్యోతి



బోయపాలెంలో రాజరాజేశ్వరీగా..




యడ్లపాడులో రాజరాజేశ్వరీగా..



శివప్రియ నగర్‌లో రాజరాజేశ్వరిగా



నరసరావుపేటలో రాజరాజేశ్వరిగా



నరసరావుపేటలో రాజరాజేశ్వరీగా



నరసరావుపేటలో గజలక్ష్మీగా

రొంపిచర్లలో పర్యటించిన ఎమ్మెల్యే



కల్యాణ మండపం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల : మండల కేంద్రంలో మంగళవారం శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. గ్రామంలో నిర్మిస్తున్న టీటీడీ కల్యాణ మండపం పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన భవనాలను పరిశీలించారు. నూతన భవనాలను త్వరలో ప్రారంభిస్తామన్నారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గంగిరెడ్డి సాంబశివారెడ్డి ఏర్పాటు చేసిన పల్నాడు రెస్టారెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచులు పదాల చక్రారెడ్డి, గెల్లి చిన కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కురుగుంట శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పచ్చవ రవీంద్రబాబు, అన్నెం పున్నారెడ్డి, చపారపు సంజీవరెడ్డి, పదాల రమణారెడ్డి, హనిమిరెడ్డి, గెల్లి కోటిరెడ్డి, కల్లి పిచ్చిరెడ్డి, పల్లెల మల్లిఖార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధారాలతో ఫిర్యాదు చేసే సెల్‌ఫోన్ సేకరిస్తాం



సెల్‌ఫోను అందజేస్తున్న ఎస్సై తిరుపతిరావు

శావల్యాపురం: సెల్‌ఫోన్లు పోయిన వారందరూ తగిన ఆధారాలతో పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేస్తే సాంకేతిక పరిజ్ఞానం ద్వారా చర్యలు తీసుకుంటామని ఎస్సై తుళ్లూరి తిరుపతిరావు వెల్లడించారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషను సెల్‌ఫోను చోరీకి గురైన బాధితుడికి సెల్‌ఫోను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సారథ్యంలో సెల్‌ఫోను పొరబాటున పోగొట్టుకున్నా, చోరీకి గురైనా సత్వరమే ఆధారాలతో ఫిర్యాదు చేస్తే అటువంటి వారందరికీ సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సులభంగా రీకవరీ చేస్తామన్నారు. అనంతరం మండలంలోని గంటావారిపాలెం గ్రామానికి చెందిన కుంభా యోగయ్యకు చెందిన రూ. 20 వేలు విలువ చేసే వీవో కంపెనీ సెల్‌ఫోను చోరీకి గురికాగా సాంకేతిక పరిజ్ఞానంతో రీకవరీ చేసి అందజేశారు.